

టూరిజం పోలీస్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -లేపాక్షి

స్థానిక నంది విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన టూరిజయం పోలీసుకేంద్రాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి వర్చువల్ పద్ధతిలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేపాక్షి రాష్ట్రంలోనే ప్రముఖ యాత్ర కేంద్రాల్లో ఒకటని అన్నారు. ఇక్కడకు అనేక ప్రాంతాలనుండి యాత్రికులు వస్తుంటారని చెప్పారు. ఈసందర్భంగా వారికి సహాయ సహకారం అందించడానికి పోలీస్ శాఖ తరపున ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, సిఐ వేణుగోపాల్, ఎస్ఐలు మునీర్ అహమ్మద్, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి మడకశిర

తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యనుమ పరిష్కరించాలని నగర పంచాయతీ పరిధిలోని చీపులేటి గ్రామానికి చెందిన మహిళలు ఖాళీబిందెలతో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు అనుమక్క, తిప్పమ్మ, పద్మ, నాగమణి తదితరులు మాట్లాడుతూ భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ తాము నెల రోజులుగా నీటి కోసం తీవ్రఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్యను మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. వ్యవసాయ బోర్లను ఆశ్రయించి నీటిని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని తమ సమస్య పరిష్కారం చేసే వరకు తాము ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై బైటాయించారు. దీంతో మడకశిర హిందూపురం ప్రాంతాలకు రాకపోకలు స్థంబించిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు మహిళలకు నచ్చే చెప్పడానికి ప్రయత్నించగా వారు తమ సమస్య పరిష్కరించే వరకు విరమించేది లేదని బీష్మించుకు కూర్చొన్నారు. చివరకు మున్సిపల్ ఎఇ మురళి సంఘటనాస్థలానికి వచ్చి మహిళలతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలోని లోపం మూలంగా మోటర్ దెబ్బ తినిందని 24 గంటల్లో మరమ్మతులు చేసి నీటి సరఫరా సక్రమంగా అందజేస్తామని చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విఆర్ఎలకు పేస్ యాప్ తొలగించాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శిల్పారామంలో ఆ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉన్నందున శాంతియుతంగా నిరసన తెలిపారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు ఇచ్చారు. అనంతరం పెద్దన్న మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించి అటెండర్ పోస్టులలో నియమించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారికి వీఆర్ఏలుగా నియమించాలని, భూ సర్వేలో పాల్గొనే వీఆర్ఏలకు టీఏ తో పాటు డీఏ ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా వీఆర్ఏలలో ఎక్కువ మంది విద్యా అర్హత లేనందున పేస్ యాప్ ఉపయోగించుకునే పరిజ్ఞానం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆ యాప్ నుంచి వారిని మినహాయించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ సేవల్లో తమ పాత్ర కీలకమని, పలుమార్లు ప్రభుత్వ దష్టికి తమ సమస్యలు తెచ్చామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. అనంతరం కోడ్ ఉన్నందున పరిమిత సంఖ్యలో కలెక్టరేట్ లోని డిఆర్ఒ కొండయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ప్రసాద్, గంగాద్రి, నాగరాజు, చిన్న ఓబులప్ప, లింగప్ప, నాగప్ప, చిన్నయ్య, నరసప్ప, నరసింహులు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



విఆర్ఎల నిరసన

చేనేతల సంక్షేమం పట్ల టీడీపీ నాయకుల వ్యాఖ్యలు దుర్మార్గం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేత సంక్షేమం పట్ల టిడిపి చేస్తున్న వాఖ్యానాలు దుర్మార్గమని టీడీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేశారని వైసిపి నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి చేనేత విభాగం ఉడుముల రాము, కాలంగి శ్రీనివాసులు, చందమూరి నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి పెణుజూరు నాగరాజు తదితరులు మాట్లాడారు. రాయితీ. సాయాన్ని రూ.600ల నుంచి వెయ్యిరూపాయలకు పెంచుతామని ధర్మవరంలో సేతన్నల సాక్షిగా చంద్రబాబు అప్పట్లో హామీ ఇచ్చి తర్వాత బుట్టదాఖలు చేశారని గుర్తు చేశారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం నేతన్న నేస్తం పథకం ద్వారా ఒకేసారి రూ. 24 వేలు చొప్పున అందించి చేనేతల అభివృద్ధిలో భాగస్వామ్యులయ్యారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి 2018లో పట్టణంలో జోలెపట్టి భిక్షాటన చేసి 37 బాధిత చేనేత కుటుంబాలకు రూ. 65 వేలు సాయం అందించారన్నారు. అంతేకాక వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆత్మహత్య చేసుకున్న చేనేతల కుటుంబాలకు ఆర్థిక సాయం రూ. 5 లక్షలకు పెంచి అర్హులైన చేనేతలందరికి అందించారన్నారు. వంద యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించి చేతి మగ్గాల వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నానున్నారు. ఇదంతా టిడిపి నాయకులకళ్లకు కనిపించడం లేదా అని మండిపట్టారు. ఈ సమావేశంలో 40 వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్సన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

మను సంస్కృతితో దేశానికి ముప్పు : కెవిపిఎస్

ప్రజాశక్తి హిందూపురం

మను సంస్కృతి విధానంతో దేశానికి ముప్పు ఏర్పడుతుందని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ అన్నారు. మతోన్మాద శక్తులైన ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ బుధవారం హైదరాబాదు నగరంలో మను సంస్కృతి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో దీనిని వ్యతిరేకిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మను సంస్కృతి విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా మను సంస్కృతి గ్రంథాన్ని ఆవిష్కరించడం ఈ దేశంలో ఉన్నా దళితులు, పేదలు, ఉద్యోగ, ఉపాధ్యాయులందరిని అవమానపరచడమేనని అన్నారు. భారత రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్న ఆర్ఎస్ఎస్ బహిరంగదళ్ సంస్థలను వెంటనే రద్దుచేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిఎస్‌పి శ్రీరాములు, మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అగౌరపరిచిన్న బిజెపి అనుబంధ సంఘాలను దళితులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మధు, అధ్యక్షులు నారాయణప్ప, అంజనప్ప, చర్లపల్లి నరసింహప్ప, మండల అధ్యక్షులు తిమ్మయ్య, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు

ఈఎస్ఐ వైద్యం..అందని ద్రాక్షేనా..?

> వేదిస్తున్న సిబ్బంది కొరత
> మందులు లేక రోగుల ఇక్కట్లు
> సిఐటియు ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు వైద్యం అందని ద్రాక్షగానే మారిపోయింది. ఈ ఆసుపత్రిలో 19 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా..ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఇక మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. కార్మికులు, పరిశ్రమ యాజమాన్యాల నుంచి ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ అందుకు తగ్గట్లుగా నాణ్యమైన వైద్యం మాత్రం అందడం లేదు. ఈఎస్ఐ ఆసుపత్రి సేవలను పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎప్పటినుంచో కోరుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కార్మికులు నిట్టూర్చడం తప్ప చేసేదేమీ లేకుండా పోతోంది.

సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన

జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక్క అసుపత్రి ఈఎస్ఐ అసుపత్రి అని, ఈ అసుపత్రిలో సిబ్బంది లేక కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, వెంటనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా చేయాలని సిఐటియు సత్యసాయి జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి నరసింహప్పలు మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలో దాదాపు 40 వేల మంది కార్మికులకు వైద్య సేవలు అందాలన్నారు. హిందూపురం చుట్టుపక్కల ఉన్న మండలాల్లో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు వారి వేతనాల నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ చెల్లిస్తున్నప్పటికీ వారికి నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ఆసుపత్రిలో 19 మంది సిబ్బంది ఉండాల్సి ఉన్నప్పటికి కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారన్నారు. ఉన్నవారూ సక్రమంగా పనిచేయటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని, పూర్తి స్థాయిలో మందులను సరఫరా చేసి, కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయించుకుని వాటికి సంబంధించిన బిల్లులను సమర్పించి ఆరు నెలలు గడుస్తున్నా మంజూరు చేయడం లేదన్నారు. ప్రతి నెలా కార్మికులు ఈఎస్ఐ చెల్లిస్తూ, వైద్య సేవల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈఎస్ఐ కార్డు ఉన్నవారికి వైద్య సేవలు అందించడం లేదన్నారు. దీనికి ప్రధాన కారణం బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడమేనని పేర్కొన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం ఈఎస్ఐ రూపంలో కార్మిక వేతనాలు నుంచి కోత విధించి ఖజానా నింపుకుంటోందే తప్ప కార్మికుల సంక్షేమాన్ని మాత్రం విస్మరించిందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలు దఫాలు ఆందోళనలు చేసి వినతులు సమర్పించినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అప్పటికీ సమస్యలను పరిష్కరించకపోతే ఆసుపత్రి ఎదుట నిరవదిక నిరాహార దీక్షకు సిద్ధమవుతామవుతామని హెచ్చరించారు. అనంతరం ఈఎస్ఐ డాక్టర్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, ప్రీ ప్రికాట్ బి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జయరాంరెడ్డి, కోశాధికారి నందీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, రామచంద్ర, బాబయ్య, మూర్తి, ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి రామకృష్ణ, ఐరన్ ఫర్నీచర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జబీవుల్లా, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఈఎస్ఐ అసుపత్రి ఎదుట ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీనివాసులు

నేతన్నలపై ప్రభుత్వాల సవతి తల్లి ప్రేమ

> చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు,
> రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలక్రిష్ణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో చేనేతలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమను చూపుతున్నాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలక్రిష్ణలు ఆరోపిం చారు. మంగళవారం ధర్మవరం పట్టణం మార్కెట్ వీధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చేనేతల కోసం అనేక హామీలిచ్చి వాటిని నేటికీ అమలు చేయలేకపోతున్నారన్నారు. చేనేత పాలసీ అమలుచేస్తామని, 45 ఏళ్లకు పింఛన్ ఇస్తామని 50 ఏళ్లు అయినా పింఛన్ ఇవ్వలేదన్నారు. 50 ఏళ్లు వయస్సు ఉన్న నేతన్నలు ఏ పనీ లేరని, అటువంటి వారికి ఎలాంటి ఆంక్షలూ లేకుండా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో ముద్రా రుణాలు ఇవ్వాలని.. పావలా వడ్డీ రుణాలు కూడా ఇవ్వాలన్నారు. ముడి పట్టు సరుకుల ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందే తప్ప వాటిని తగ్గించాలన్న ఆలోచన కూడా చేయలేదని మండిపడ్డారు. సెంట్రల్ శిల్క్ బోర్డు ద్వారా రేషం, వార్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసి వాటిని సబ్సిడీతో చేనేత కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు. పవర్ లూమ్స్ పట్టుచీరలు తయారు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.2 వేలు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది బడ్జెట్ రూ.200 కోట్లు మాత్రమే కేటాయిస్తూ చేతులు దులుపుకుంటోందన్నారు. చేనేత కార్మికులు పనులు లేక.. వస్తున్న ఆదాయం సరిపోక.. అప్పులు చేసి వాటిని తీర్చలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అయితే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం పరామర్శించిన దాఖలాలు కూడా లేవన్నారు. చేనేతకు కేటాయించిన బడ్జెట్ ఉద్యోగులకే సరిపోతోందని, కార్మికులకు ఏమిచ్చి ఆదుకుంటారని ప్రశ్నించారు. దీనికి తోడు చేనేతపై జీఎస్టీ విధించిందని వాటిని తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా శివదుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగాధరరావు, సభ్యులు రాజు, ఓబులేసు, బషీర్ అహమ్మద్, నాయకులు చౌడప్ప, అన్నం సూర్యనారాయణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించండి

> కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో జరగనున్న ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో కలెక్టరు పరీక్షల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు, దిశ నిర్దేశం చేశారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు పరీక్షలు నిర్వహించ బోతున్నామన్నారు. అధికారులందరూ సమన్వ యంతో పనిచేసి పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలలో లైట్లు, టాయిలెట్లు, అవసరమైన బల్లలు, ఇప్పటివరకు పూర్తి అయిన ఏర్పాట్లను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. మార్చి 15 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు మొదటి రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు అలాగే ఈనెల 15వ తేదీ నైతిక విలువలు, మానవ విలువలు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. 17న పర్యావరణ విద్యపై మొదటి సంవత్సర విద్యార్థులకు పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 20 నుంచి మార్చి 7 వరకు ఒకేషనల్ మొదటి రెండవ సంవత్సరపు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణ ఈనెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల 15, 17 తేదీలలో జరిగే పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరు అయిన విద్యార్థులు నాట్ క్వాలిఫైడ్‌గా పరిగణించబడతారన్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, అందుబాటులో వైద్య సిబ్బంది ఉండాలన్నారు. తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నైతిక మానవ విలువలు పరీక్షలు 133 కేంద్రాలలో ఉంటాయని ప్రాక్టికల్ పరీక్షలు రెండు విడతలుగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు, థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్షల నియమ నిబంధనలు పాటించాలన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని, పరీక్ష కేంద్రాలలోకి సెల్ ఫోన్లు తీసుకురాకూడదని హెచ్చరించారు. పరీక్షల సమయంలో చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లనూ కార్మిక శాఖ మూసి వేయించాలన్నారు. జిల్లాలో మొదటి సంవత్సర విద్యార్థులు 9307 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 12904 మంది మొత్తం 21904 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. విద్యార్థులు నిర్ణీత సమయం కంటే అరగంట ముందుగానే హాజరు కావాలని, పరీక్షలు జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ విధించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. తహశీల్దార్లు, పోలీస్ శాఖ ఎంప్లాయిస్ స్క్వాడ్‌గా ఏర్పడి పరీక్ష కేంద్రాలకు పరీక్ష పేపర్లు చేర్చాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అవసరమైన బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డిఐసి కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు, డీఈఈవో రఘునాథరెడ్డి, ఏవో జి.వెంకట్రావు, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్

అధికారం కోసం హత్యా రాజకీయాలు : టిడిపి

ప్రజాశక్తి హిందూపురం

వైసిపి అధికారంలోకి రావడానికి హత్యా రాజకీయాలకు పాల్పడిందనిటిడిపి నాయకులు ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి ఆధ్వర్యంలో ముద్రించిన జగనా సుర రక్త చరిత్ర పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రతి పక్షంలో ఉన్న సమయంలో జగన్ మొదలైన కోడి కత్తి డ్రామా నుంచి వైఎస్ వివేకా హత్యా వరకు సాగిందని ఆరోపించారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. వివేక హత్య కేసు వైసిపి హత్య రాజకీయమేనని వారు ఆరోపించారు. పూర్తి సమాచారం ప్రజలకు తెలిపేందుకే జగనాసుర పుస్తకం విడుదల చేసామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, రాష్ట బిసి మహిళ, రైతు మైనార్టీ, ఎస్‌టి కార్యదర్శులు అమర్నాథ్, పరిమళ, నారాయణరెడ్డి, వెంకటరమణ, కౌన్సిలర్ రాఘవేంద్ర, పార్లమెంట్ వాణిజ్య విభాగం, లీగల్ సెల్ అధ్యక్షులు జెపికె. రాము, శివశంకర్, బిసి సెల్ ఉపాధ్యక్షుడు నబిరసూల్, కార్యదర్శుల రవీంద్ర ప్రసాద్, గడ్డం ప్రసాద్, నాయకులు సుమో శీనా, వెంకటేష్, మురళి దేశాయి, దుర్గా నవీన్, విజయలక్ష్మి, సురేష్ నాయక్, నాగేంద్ర, ప్యారూ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

చెన్నేకొత్తపల్లి : మండలంలోని కనుముక్కల గ్రామంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ప్రధానంగా మద్యపానం, ధూమపానం, గుట్కా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రమాదేవి, పాఠశాల హెచ్ఎం పార్వతి, సిహెచ్ఓ సౌందర్య, ఎంపిహెచ్ఎ శ్రీనివాసులు, ఆశాకార్యకర్త పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో యజమానులకు 'భూరక్ష'

బత్తలపల్లి : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీసర్వేతో యజమానులకు అన్ని హక్కులపైన మరింత భద్రత ఉంటుందని రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సునీత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మల్లకుంట, అప్పరాచెరువు గ్రామాల్లో భూ రీసర్వేపైన గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర సర్వే ద్వారా ఎలాంటి అవకతవకలకు తావుండదన్నారు. రైతులు తమ వద్దనున్న పట్టాదారు పాసుపుస్తకాలు. ఇతరత్రా పత్రాలు ఉంటే వాటి జిరాక్సును తమకు అందజేయాలన్నారు. వాటి ఆధారంగా సర్వే చేసి హద్దులు చూపుతామన్నారు. ఈ గ్రామసభలో విఆర్ఓ రవికాంత్ రెడ్డి, విలేజ్ సర్వేయర్లు కల్పన, ఆశాజ్యోతి, వేదవతి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాలుర బాలికల ప్రధాన ఉపాధ్యాయులు చిన్న కృష్ణారెడ్డి సుమన తెలిపారు. అంతర్జాతీయ పుస్తక వితరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశాన్ని గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, ఇషాద్‌వలి, అనంతలక్ష్మి, నాగరత్నమ్మ, విశ్వేశ్వరయ్యతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

బుక్కపట్నం : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన కెజిబివి విద్యార్థినులు రాష్ట్రస్థాయి జట్టులో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సువర్ణ తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి 12వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి 41వ సీనియర్ విభాగం పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినిలు మీనా, జోష్ణ, హిమబిందు, పూజిత, మైత్రి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తెచ్చారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను జిల్లా షూటింగ్‌బాల్ ఇన్‌ఛార్జి శివప్రసాద్, ప్రిన్సిపల్ సువర్ణ, పిఇటి చిన్నమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

వేలం పాటతో రూ. 1.28 లక్షల ఆదాయం

అమరాపురం : మండలంలోని హేమావతిలో నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ. 1.28 లక్షల ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. స్థానిక సచివాలయంలో సర్పంచి తిప్పేస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఈవోఆర్డీ సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

బుక్కపట్నం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం పెద్దమ్మ భవాని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి ఎస్టీ సెల్ నియోజవర్గ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ సాకే యశోద రాయుడు, టిడిపి సత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై అమ్మవారిని గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మంజు, మల్లికార్జున, శివ, సూరి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కా గృహాలు ప్రారంభం

లేపాక్షి : మండలం పరిధిలోని కల్లూరు గ్రామంలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిర్మించిన 23ఇళ్లను స్పెయిన్ దేశస్తులు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామసుతలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రంగనాయకులు, వన్నూరు స్వామి నారాయణ స్వామి, స్పాన్సర్ టీం సభ్యులు రామాంజనేయులు గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణ పనుల పరిశీలన

హిందూపురం : పట్టణంలోని మెయిన్ బజారులో చేపట్టిన జామియా మసీదు నిర్మాణ పనులను ఎమ్మెల్సీ ఇక్బాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తానే స్వయంగా కాంక్రీట్ మోశారు. అనంతరం గుత్తేదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు తాను అందిస్తానని మసీదు నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ నిర్వాహకులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

పెనుకొండ : క్రీడలు యువతకు ఎంతో అవసరం అని యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానం లో టీడీపీ నాయకురాలు సవితమ్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా గత నెలరోజులుగా ఎన్టీఆర్ మెమోరియల్ కప్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో పెనుకొండ పట్టణానికి చెందిన థండర్స్, ప్రెంచ్ లెవెన్స్ జట్లు పోటీపడ్డాయి. పెనుకొండ థండర్స్ 8 పరుగుల తేడా తో విజయం సాధించింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాధవ నాయుడు, చంద్ర మౌళి, సూర్యనారాయణ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

సైక్లింగ్‌తో ఆరోగ్య ప్రయోజనాలు

బత్తలపల్లి : నేటి సమాజంలో అనేక రుగ్మతల నుంచి బయటపడాలంటే సైకిల్ తొక్కడం సరైన మార్గమని ఫ్యామిలి ఫిజీషియన్ డాక్టర్ లిఖిత పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సూచనల మేరకు ఆయుస్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మెగా సైక్లోన్ ర్యాలీని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వలన ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రాజశేఖర్, పర్యవేక్షక సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ, నారమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రవి, తిరుపాలు పాల్గొన్నారు.

దామోదర సంజీవయ్య సేవలు మరువలేనివి

కొత్తచెరువు : మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని గ్రంథాలయ అధికారి కే జయరాం, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎస్ రామాంజనేయులు అన్నారను. దామోదర సంజీవయ్య జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎస్సీ కాలనీలో ఆర్డిటి పాఠశాలలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్, వెంకటరమణప్ప, సుబ్రహ్మణ్యం, చెన్న రాయుడు, శ్రీనివాసులు, మునీరు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - పెనుకొండ

పట్టణంలోని కియా అనుబంధ సంస్థ ఏ సి టి ప్లాస్టిక్ పెయింట్స్ కంపెనీ లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగిపై లైంగిక వేధింపులు గురిచేస్తున్న హెచ్ ఆర్ కరుణాకరన్ ,విజయ్ కుమార్ ని వెంటనే అరెస్ట్ చేయాలని, తొలగించిన మహిళా ఉద్యోగిని విధులకు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కంపెనీ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగిని ఏ కారణం లేకుండా హెచ్‌ఆర్ కరుణాకరన్ ప్రతిరోజు లైంగిక వేధింపులు గురిచేశాడని విమర్శించారు. చిన్న కారణంతో కంపెనీ నుండి గత మూడు రోజులు క్రితం మహిళా ఉద్యోగిని పనిలో నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కంపెనీకి సంబంధించిన హెచ్‌ఆర్ కరుణాకరన్ ,విజయ్ కుమార్ దురుసుగా ప్రవర్తించారని అన్నారు. దీంతో బాధితులు తమను ఆశ్రయించారని ఇప్పటికైనా సంబంధిత యాజమాన్యం స్పందించి ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కంపెనీ ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉద్యోగి ఉష, లక్ష్మీదేవి,సిఐటియు మండల నాయకులు వజ్రం నాగప్ప, మూర్తి ,శ్రీరాములు, ముత్యాలు ,అంజి ,అన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



కంపెనీ ముందు నాయకులు, బాధితుల నిరసన

ఆర్డీటీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రస్తుత సమాజంలో చిన్నపాటి వైద్యులు కూడా అధిక ఫీజులు వసూలు చేసి పేదవారిని దోచుకుంటున్న నేపథ్యంలో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నామమాత్రపు ఫీజుతో పేద ప్రజలకు అందిస్తున్న ఆర్డీటీ సేవలు అభినందనీయమని హెచ్‌డిఎఫ్ బ్యాంకు నెల్లూరు, రాయలసీమ జిల్లాల సీనియర్ వైస్ ప్రసిడెంట్ మంగిశెట్టి ప్రవీణ్ అన్నారు. బ్యాంకు తరపున ఆర్డీటి ఆసుపత్రికి అవసరమైన రూ.30లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీటీ పోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌తో పాటు బ్యాంకు రీజనల్ మేనేజర్ వెంకటచంద్రారెడ్డి, అనంతపురం మేనేజర్ రాజారెడ్డి, ఆర్డీటీ రీసోర్స్ మొబిలైజేషన్ డైరెక్టర్ సాగరమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఆర్డీటీ సేవలను కొనియాడారు. సంస్థ పోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ సంస్థ పలు జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపట్టినా బత్తలపల్లిలోని ఆసుపత్రి ప్రత్యేక స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారికి సైతం కరోనా సమయంలో సేవలు అందించడం మరువలేనిదన్నారు. వేలాది మంది రోగులకు సేవలు అందిస్తున్న బత్తలపల్లి ఆసుపత్రికి దాతలు చేసిన సహాయం మరువలేనిదన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రిలేషన్స్ మేనేజర్ యుగేంద్రనాథ్, జిఐబి హెడ్ వినోద్, ఆర్డీటీ ఫండ్ మొబిలైజేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగప్ప, ఆసుపత్రి హెచ్‌ఐలు డాక్టర్ పాల్, డాక్టర్ దశరథ్, డాక్టర్ మనోహర్, నర్సింగ్ స్కూల్ సూపరెండెంట్ సిస్టర్ శాంతి, ఆసుపత్రి మేనేజర్ పవన్ కుమార్. మెయిన్టెనెన్స్ మేనేజర్ హనుమంతరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ శంకర్, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ విమర్శించారు. మాల, మాదిగ, కార్పోరేషన్లకు నిధులు కేటాయించాలని, దళిత అభివద్ధి సంక్షేమం కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 27 సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేయడం ప్రభుత్వ చేతగానితనం అని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు విమర్శించారు. ఈ మేరకు ఎస్సీ సెల్ ఆధ్వ్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేసింది శూన్యమన్నారు. విదేశీ విద్యకు అర్హులైన విద్యావంతులకు అన్యాయం చేశాడని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో దళిత సామాజిక వర్గానికి ఇచ్చిన 27 పథకాలను వైస్సార్సీపీ ప్రభుత్వం రద్దు చేయటమే కాకుండా, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మళ్లించిందని విమర్శించారు. నియోజకవర్గం లోని దళితుల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, హిందూపురం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యదర్శులు రెడ్డెప్ప,శ్రీనివాసులు, ప్రేమలత, టిడిపి ఎస్సీ అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ముని కుమార్, చిన్నప్ప, నాయకులు చంద్ర, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములకు రక్షణ కల్పించండి : కెవిపిఎస్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల పరిధిలోని కేతగాని చెరువు, తదితర గ్రామాల దళిత రైతుల భూములకు రక్షణ కల్పించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ సిద్దేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులతో కలిసి కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ యంగ్ ఇండియా ప్రాజెక్ట్ అనే స్వచ్ఛంద సంస్థ (నరేంద్ర బేడీ) మామిడి , పశువుల పెంపకం ద్వారా పాల ఉత్పత్తిని అభివృద్ధి చేస్తూ దళితులను ఆర్థికంగా బలపరస్తామని నమ్మబలికి కేతగాని చెరువు గ్రామానికి చెందిన దళితుల భూములను 25 సంవత్సరాల పాటు లీజు ఒప్పందం ద్వారా 1988 సంవత్సరంలో తీసుకుందన్నారు. కొంతమేర అభివృద్ధిపరిచి అనంతరం 2008 సంవత్సరంలో రాత పూర్వకంగా దళితుల భూముల దళితులకు అప్పగించిందన్నారు. ఆ సమయంలో సంస్థలో పని చేసే లక్ష్మమ్మ అను మహిళ రిజిస్టర్ డాక్యుమెంటులో ఉండే కొన్ని లొసుగులను ఉపయోగించి తద్వారా సంబంధిత అధికారులను ప్రలోభ పెట్టి కేతగాని చెరువు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి అనే వ్యక్తితో కలసి అక్రమంగా కొనుగోలు జరిపి దళితులను మోసం చేసిందన్నారు. ఇప్పటికీ సర్వే నంబర్ 323లో 3.17 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల మేరకు దళితుల పేరు మీదనే ఉందన్నారు. భూమిని కొనుగోలు చేసామని అక్రమంగా దళితుల భూమిని స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన కృష్ణమూర్తిని దళితుల ఐక్యంగా ఎదుర్కొని తమ భూమి రక్షణ కోసం గత సంవత్సర కాలం నుండి పోరాడుతున్నారన్నారు. ఈ విషయమై దళితుల భూములు ఆక్రమణకు గురికాకుండా అక్రమానికి పాల్పడి దౌర్జన్యం చేస్తున్న లక్ష్మమ్మ , కృష్ణమూర్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య , జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ , దళితులు అంజనమ్మ , వెంకట లక్ష్మమ్మ , హనుమక్క , సంజీవమ్మ , అంజనప్ప , నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిహారం పంపిణీ కోసం ప్రతిపాదనలు సిద్ధం

ప్రజాశక్తి - నల్లమాడ

బెంగళూరు టు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం నల్లమడ మండలంలో భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం పంపిణీ చేయడానికి నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తహశీల్దార్ దేవేందర్ నాయక్ తెలిపారు. మండలంలో 25 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోందన్నారు. మెట్ట భూములకు సంబంధించి ఎకరాకు రూ. 8 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రతిపాదన పంపామన్నారు. అదేవిధంగా పండ్లతోటలు, భూములు, బోరు బావులు, వివిధ నిర్మాణాలు, అటవీ భూములకు సంబంధించి ఆయా శాఖల వారు పరిహారం అందిస్తారన్నారు. ఈ శాఖలకు సంబంధించి ఎకరాకు ఎంత పరిహారం ఇస్తారన్న విషయం ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉందని చెప్పారు. నల్లమాడ, పుట్టపర్తి మండలాల పరిధిలోని మంగిలి గట్టు వద్ద హైవే రోడ్డుకు ప్రయాణికుల సౌకర్యార్థం స్టేజి (కూడలి) నిర్మాణానికి 14.72 ఎకరాల భూమిని సేకరించామన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న తహశీల్దార్

ప్రేమ పేరుతో బాలికపై వేధింపులు

ప్రజాశక్తి-కనగానపల్లి

మండల పరిధిలోని తల్లిమడుగు గ్రామానికి చెందిన ఏడవ తరగతి బాలికను ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో వేధించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. అందుకు సంబందించి గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు... తల్లిమడుగు గ్రామానికి చెందిన బాలిక ఏడవ తరగతి చదువుతుంది. మంగళారం అనారోగ్యం కారణంగా ఇంటికి వచ్చిన బాలిక కాలకృత్యాలకోసం బాత్‌రూమ్ వెళుతుంటే అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వెంటపడ్డారు. ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురిచేశారు. దీనిని గమనించిన బాలిక బంధువులు యువకులను మందలించడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. వీరిద్దరూ అధికార పార్టీకి చెందిన నాయకులు కుమారులు కావడం గమనార్హం. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు తమ కూతురితో కలిసి కనగానపల్లి పోలీస్ స్టేషన్లలో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. అయితే నిందితులు అధికార పార్టీ నాయకుల కుమారులు కావడంతో చర్యలకు పోలీసులు వెనుకడుగు వేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో తల్లిమడుగు గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

అవార్డు కదిరి ప్రజలకు అంకితం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న నాయకులు

సేవారత్న అవార్డు గ్రహీత డాక్టర్ సివి.మదన్ కుమార్

ప్రజాశక్తి కదిరి అర్బన్

తనకు వచ్చిన భారతీయ సేవారత్న అవార్డుకు కదిరి ప్రజలకు అంకితమిస్తున్నట్లు అవార్డు గ్రహీత, పట్టణానికి చెందిన రిషితా చిన్న పిల్లల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సివి. మదన్‌కుమార్ తెలిపారు. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించి,కోవిడ్ సమయంలో ఉచిత వైద్యసేవలు, చిన్నపిల్లలకు ఉచితం గుండె ఆపరేషన్లు తదితర పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సివి మదన్ కుమార్ గ్లోబల్స్ స్కాలర్స్ ఫౌండేషన్ ద్వారా భారతీయ సేవా రత్న అవార్డు - ఉత్తమ ఆదర్శప్రాయమైన డాక్టర్ 2023 పద్మశ్రీ డాక్టర్ ముకేష్ జీ బాత్రా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మదన్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి సహకరించిన కదిరి ప్రాంత ప్రజలకి, మిత్రులకి శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. కదిరి ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవ అందించాలని ఉద్దేశంతో మార్చి నెల నుంచి వృద్ధులకు శుక్లం, కాంట్రాక్ట్ సర్జరీ క్యాంపు ప్రతినెల మూడో ఆదివారం నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత మదన్ కుమార్‌ను వైసిపి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్ తదితరులు మంగళవారం సన్మానించారు.

మెడికల్ క్లినిక్‌లు సీజ్

పరిగి : మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నడుపుతున్న మెడికల్ క్లీనిక్‌లపై మెడికల్స్ డ్రగ్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మెడికల్ షాపు లు పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తూ నిషేధిత మందులు ఇస్తు ప్రజారోగ్యానికి హాని కలిగించే మందులు నిల్వ ఉంచుకున్న పలు క్లినిక్‌లను, షాపులను ఈసందర్భంగా అధికారులు సీజ్ చేశారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ధర్మవరం విద్యార్థి

ధర్మవరం టౌన్ : సత్యసాయి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కార్యక్రమంలో తమపాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైనట్టు మున్సిపల్ బిఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు. సైన్స్‌ఫెయిర్లఓ తమ పాఠశాలలో పదవతరగతి చదువుతున్న గౌరీనారాయణ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో మొదటిస్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు మంగళవారం గౌరీనారాయణను హెచ్ఎంతోపాటు గైడ్ టీచర్ పద్మావతమ్మ, ఉపాధ్యాయులు రాజేశ్వరి. నాగరాజు, నాగలక్ష్మి, శైలజ, హనుమంతు, విజయ్‌కుమార్ అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల సత్తా

కదిరి టౌన్ : కర్నాటక రాష్ట్రంలోని గౌరీ బిదనూరులో ఆర్గనైజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి హరీష్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ వైట్ బెల్ట్ కటాస్ విభాగంలో 7వ తరగతి చదువుతున్న జశ్వంత్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. అదే విధంగా 6వ తరగతి చదువుతున్న లవన్ కుమార్, శివశంకర్ సిల్వర్ మెడల్, కుశల్ కుమార్, అభిషేక్ బ్రౌన్జ్ మెడల్ సాధించారన్నారు. ప్రతిభా విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ అక్బర్ అలీని, విద్యార్థులను ఆయన అభినందించారు.



ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

వీర జవాన్లకు నివాళి

పెనుకొండ : 2019 ఫిబ్రవరి 14 న జమ్ము కాశ్మీర్ పుల్వామా జిల్లాలో తీవ్రవాదులు జరిపిన దాడిలో ప్రాణాలర్పించిన వీర జవాన్లుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ నివాళులు అర్పించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం వీర జవాన్ల చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్ల కుంట అంజినప్ప, డిఇ రమేష్, శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి అర్బన్ :.. అనారోగ్యంతో బాధపడుతున్న కదిరి రూరల్ మండలం బాలప్పగారిపల్లికి చెందిన గణేష్ అనే యువకుడికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆర్థికసాయం అందజేఆరు. ఈ మేరకు గణేస్‌కు రూ. 10వేలను అందజేశారు. గణేష్ గొంతు కింద ఇన్ఫెక్షన్ సమస్యతో బాధపడుతున్నాడు. సమస్యను బత్తల హరిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి బత్తల యువ సైన్యం ద్వారా బాధితుడికి రూ. 10వేలను అందజేఆరు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, ముబారక్, కార్తీక్ మహబూబ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

O.S.No.197/2021

Between:

మేకల జయరాము తండ్రి మేకల కుళ్ళాయప్ప working as part time Lecturer డోర్‌నెం.9-52, పీవర్స్ కాలనీ, సైదాపురం, నియర్ ఎస్.టి.ఎస్.ఎన్. డిగ్రీ కాలేజీ, కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

బి.గంగారం తండ్రి బంట్రోతు నారాయణ, previously working as Helper in A.P.S.R.T.C., Kaidiri Depo, డోర్‌నెం.1-1131-4అ1, Ex M.P. Road, కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి సమను

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడ మేమనగా వాది తన దావాలో కనబరచిన ప్రొంసరీనోటు బాకీ మొత్తము రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసుకున్నాడు. కావున సదరు దావాలో మీ హాజరు నిమిత్తము 24-02-2023వ తేదిన వాయిదా ఉన్నది. కావున సదరు తేదీ నాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 ని॥లకు పై తెల్పిన కోర్టులో హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24-02-2023.

కె.చౌడప్ప, బి.ఎస్సీ., బి.ఎల్., వాదిపరం వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా. సెల్: 9966350645.

మహారాజశ్రీ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.No.374/2019

Between:

యర్రసాని లక్ష్మీనారాయణరెడ్డి S/o నారాయణరెడ్డి, వయస్సు: 53 ఏళ్ళు, ఎస్.ఎస్.పి. కొట్టాల, సానేవారిపల్లి పోస్టు, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

V/s

తోట సూర్యనారాయణరెడ్డి S/o రామిరెడ్డి, వయస్సు:48 ఏళ్ళు, డోర్‌నెం.1-22, యర్రసానివారిపల్లె, తలుపుల పోస్టు & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి కోర్టు నోటీసులు

పై దావాలోని వాది అయిన యర్రసాని లక్ష్మీనారాయణరెడ్డి, ప్రతివాది అయిన తోట సూర్యనారాయణరెడ్డి అనే మీ మీద ప్రామిసరీ నోటు బాకీ వసూలు కోసం కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. పై దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం గౌరవ కోర్టువారు 13-03-2023వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆరోజు నీవు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకోవాలని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:13-03-2023.

కె.నాగేంద్రరెడ్డి, బి.ఏ., బి.ఎల్., అడ్వకేట్, కదిరి, సెల్:9440361798.

In the Court of the IIIrd Addl. Junior Civil Judge (Excise Court) Ananthapuramu

I.A. No.75/2020 in O.S.No.183/2017

Between:

N.Ishak ..Petitioner/Plaintiff

V/s

N.Ismail (Died) by his L.Rs, Muntaj ...Respondant/Defendant

Notice to Respondant

To,
Muntaj D/o Late N.Ismail, D.No.6-214, Near R.T.C. Bus Stand, Chitravathi Road, Putterparthy, Sri Sathya Sai District.

పైన నెంబరు పిటీషన్‌లో Respondant అయిన మీ హాజరు నిమిత్తము 21-02-2023 వ తేదిన ఉ॥10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

యం.జుబేర్, అడ్వకేటు, అనంతపురం, సెల్: 9849650879.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

I.A.No.65/2016 in O.S.No.49/2010

Between:

తిప్పినాయుని రాందాసు నాయుడు మరియు 7 మంది ...పిటీషనర్స్/వాదులు

మరియు

తిప్పినాయుని ప్రభాకర్ నాయుడు మరియు రెస్పాండెంట్స్ R1 to R12 మరియు Proposed R14 to R18 ...రెస్పాండెంట్లు

Proposed రెస్పాండెంట్ నెం.17కు నోటీసు

పై దావాలో పిటీషన్‌లో కనబరచిన మద్దె రమాదేవి, భర్త: ఎం.రామ్మోహన్‌నాయుడు, మద్దెవారిగొంది గ్రామం, కమతంపల్లి పోస్టు, గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. రెస్పాండెంట్ నెం.17 అయిన నీకు తెలియజేయడం ఏమనగా పిటీషనర్స్ తన దావాలో కనబరచిన భాగ పరిష్కారము కొరకు పై తెలిపిన దావాలో మిమ్మల్ని ప్రతివాదిగా చేర్చుట కొరకు దావా దాఖలు చేసుకొన్నారు. కావున సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తము 21-02-2023వ తేదిన వాయిదా ఉన్నది. కావున సదరు తేదీ నాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 ని॥లకు పై తెల్పిన కోర్టులో హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:21-02-2023.

కె.చౌడప్ప, బి.ఎస్సీ., బి.ఎల్., పిటీషనర్ తరుపున వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా. సెల్: 9966350645.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

O.S.No.429/2021

Between:

గనిదిపల్లి లలిత, భర్త: జి.జనార్ధన్‌రెడ్డి, తండ్రి: చిన్న సాని శంకర్‌రెడ్డి, డోర్‌నెం.125-15, నీలావాండ్లపల్లి, H/o ఊరివెర్ల, మద్దిమడుగు పోస్టు, నల్లచెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

1.చిన్నసాని శంకర్‌రెడ్డి తండ్రి లేట్ పక్కీర్‌రెడ్డి.
2.చిన్నసాని భాస్కర్‌రెడ్డి తండ్రి లేట్ పక్కీర్‌రెడ్డి.
3.టి.జయరామిరెడ్డి తండ్రి నాగిరెడ్డి ...ప్రతివాదులు

రెండవ ప్రతివాదికి సమను

ఇందుమూలముగా రెండవ ప్రతివాది అయిన చిన్నసాని భాస్కర్‌రెడ్డి తండ్రి లేట్ సి.పక్కీర్‌రెడ్డి, డోర్‌నెం.18-82, కొరుగుట్టపల్లి గ్రామం, తలుపుల మండలం, శ్రీసత్యసాయి జిల్లా అయిన నీకు తెలియజేయడమేమనగా వాది తన దావాలో కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని భాగ పరిష్కారము కొరకు దావా దాఖలు చేసుకొన్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తము 21-02-2023వ తేదిన వాయిదా ఉన్నది. కావున సదరు తేదీ నాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 ని॥లకు పై తెల్పిన కోర్టులో హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:21-02-2023.

కె.చౌడప్ప, బి.ఎస్సీ., బి.ఎల్., వాదిపరం వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా. సెల్: 9966350645.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

I.A.NO.193/2021 in O.S.No.197/2021

Between:

మేకల జయరాము తండ్రి మేకల కుళ్ళాయప్ప working as part time Lecturer డోర్‌నెం.9-52, పీవర్స్ కాలనీ, సైదాపురం, నియర్ ఎస్.టి.ఎస్.ఎన్. డిగ్రీ కాలేజీ, కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

బి.గంగారం తండ్రి బంట్రోతు నారాయణ, previously working as Helper in A.P.S.R.T.C., Kaidiri, డోర్‌నెం.1-1131-4అ1, Ex M.P. Road, కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాదులు

రెస్పాండెంట్‌కు నోటీసు

పై దావాలో పిటీషన్‌లో కనబరచిన ప్రొంసరి నోటు బాకీ మొత్తం రాబట్టు నిమిత్తమై రెస్పాండెంట్/ప్రతివాదికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టులో అటాచ్‌మెంట్ చేసుకున్నాడు. సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తము 24-02-2023వ తేదిన వాయిదా ఉన్నది. సదరు తేదీ నాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 ని॥లకు పై తెల్పిన కోర్టులో హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు:

అనంతపురం ఆర్.డి. (ప్రస్తుతం హిందూపురం, ఆర్.డి. శ్రీ సత్యసాయి (జిల్లా) కదిరి. సబ్.ర్.డి.కి చేరిన సైదాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో కదిరి టౌన్ & మండలంలో Govt.Dry 105-3 Ac.0.42 Cents or 0.170 hectares, out of this AC.0.15 Cents or 0.060 hectors.
చెక్కుబందీ: తూర్పు:ఎన్.తిరుపాల్ భూమి, పడమర:డి.రామలక్ష్మమ్మ భూమి, ఉత్తరం: డి.రామలక్ష్మమ్మ భూమి, దక్షిణం: Owni Rasta.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:24-02-2023.

కె.చౌడప్ప, బి.ఎస్సీ., బి.ఎల్., పిటీషనర్ తరుపున వకీలు, కదిరి టౌనన్, శ్రీసత్యసాయి జిల్లా. సెల్: 9966350645.